# మనసు లేని మనసు

శేఖర్ రైలు స్టేషనుకు వెళ్ళాడు.

రైలు రావడానికి యింకా ఒక గంట విరామం వుందని తెలిసింది.

గంట విరామం అంటే ప్లాట్‌ఫారమ్ మీద యిట్టే గడిపి వేయడానికి వీలు లేనిది.

రైలు ఆలస్యంగా రావడాన్ని గురించి రెండు నిమిషాలు విసుక్కున్నాడు.

వీం విసుక్కుంటే యేం లాభం?

ఈ రైలు తనకు కావాలనుకుంటే గంట సేపు వేచి వుండడం తప్ప యింకో మార్గంలేదు.

ఈ గంటయినా నిలకడగా అలాగే వుంటుందని అనుకుందుకు లేదు.

స్టేషన్లో నోటీస్ బోర్డుమీద మటుకు రాస్తారు:

"ట్రెయిన్స్ అర్ లైక్లీ టు మేకప్ టైమ్" అని.

ఊరికే రాయడంమటుకే — అనుకున్నాడు శేఖర్.

గంట క్రమంగా గంటన్నర అవుతుంది.

ఇంత వరకు అది సహజం.

ఇంకా తను లేచినవేళ మంచిది కాకపోతే పూర్తిగా రెండు గంటలవుతుంది.

ఎన్ని గంటలయినా వేచి వుండడం తప్ప యింకేమీ చేయగలది లేనప్పుడు, యీ ఆలోచనలన్నీ అనవసరం అనుకున్నాడు శేఖర్.

రైళ్లతో అవసరం వున్నప్పుడు వాళ్లను అనుసరించి వెళ్లవలసిందేగాని, మనం చెప్పినట్టు వింటాయా అవి? వాటి యిష్టాను సారమే అని నడవనప్పుడు యిక మన యిష్టం అంటూ యెక్కడ వుంది?

అందుకనే రైలు ప్రయాణం అంటే భయం పుడుతుంది.

దగ్గర ప్రయాణం అయితే కారు నయం అనిపిస్తుంది.

దూరం అయినప్పుడు రైలుతప్ప యింకో మార్గంలేదు.

ఒకరకంగా చూస్తే—పూర్వకాలంలోలాగ రైళ్లు అంటూ వుండకపోతే యీ

అలస్యం అవడం అనే బెడద వుండదు. కాని అసలే రైళ్లు లేకపోతే యీ విశాల ప్రపంచంలో బ్రతకడం యెలా?

శేఖర్ ప్లాట్‌ఫామ్ టిక్కట్టు కొనుక్కున్నాడు.

చిల్లరలేదని బెదిరిస్తే రూపాయి కాగితం కౌంటర్లోనే వదిలేశాడు.

అవును మరి. అసలు టిక్కట్టే యివ్వకపోతే అనక ఎంత యిబ్బంది!

ప్లాట్‌ఫామ్ చిన్నది.

చిటికలో ఒకసారి పచారుచేసి రావచ్చును.

ఇలా ఎన్నిసార్లుచేస్తే రైలు రావాలి?

ఈ దిక్కుమాలిన ఊళ్లో తను వుండవలసిరావడమే గొప్ప దోషం.

దీనికితోడు తన్ను చూడడానికంటూ అప్పుడప్పుడు స్నేహితులు, బంధువులు వగైరా రావడం, వాళ్లకోసం తను స్టేషన్‌కు వస్తూ వుండడం, తను వచ్చినప్పుడల్లా పగబట్టినట్లుగా రైళ్లు అలస్యంగా వస్తూ వుండడం.... యిదంతా గొడవగానే వుంది. కాని దీన్నుంచి విడివడడం... ఎలా? తప్పదు....

ఇదో రకమయిన శిక్ష.

ఇంతకంటె మరేం లేదనుకున్నాడు శేఖర్.

కనుచీకటి పడుతోంది.

స్టేషన్లో గుడ్డిలాంతరు వెలిగిస్తున్నాడు పోర్టర్.

శేఖర్ సిగరెట్ వెలిగించుకున్నాడు.

స్టేషన్ మాష్టర్ గదిలోంచి బయటకు వచ్చాడు.

మెడలో ఉత్తరీయం సవరించుకుంటూ గందరగోళంగా ప్లాట్ ఫామ్ అంతా కలయచూచాడు ఎందుకో.

సరీగా ఆ సమయానికే శేఖర్ ఆ దగ్గర్లో పచార్లుచేస్తున్నాడు.

'హల్లో. శేఖర్‌గారు! నమస్తే! రైలుకోసమే వచ్చినట్లున్నారు.'

'నమస్తే, అవునండీ! రైలుకోసమే...'

రైలుకోసం కాకపోతే తన గుడ్లగూబ ముఖం చూడడానికి వచ్చాననుకుంటున్నాడా... స్టేషన్ మాష్టర్?

పైకిమాత్రం మర్యాద కనిపింపచేశాడు.

ఈ మాత్రం మర్యాద లేకపోతే ఈ లోకంలో నెగ్గుకురావడం కష్టం.

పాపం, ఈ స్టేషన్ మాష్టరు -- శ్రీరాములు, మంచివాడే.

కాకపోతే యితని ముఖం మంచిదికాదు.

అంటే చూడడానికి బాగుండదు. అంతే.

'అయితే శ్రీరాములుగారూ! ఈ పూట రైలు వస్తుందంటారా?' అనడిగాడు శేఖర్; ఎందుకయినా మంచిదనే ఉద్దేశ్యంతో.

'అమ్మమ్మ! ఎంతమాట! రైలు రాకపోవడమా? అలా ఎన్నడూ జరగదులెండి. కాకపోతే కాస్తో కూస్తో అలస్యంగా వస్తుంది. అంతే' అన్నాడు శ్రీరాములు, నిజమయిన విశ్వాసపాత్రుడి ధోరణిలో.

'అయితే యింతవరకు యెంతలేటు తేలింది.?'

'ఎంత? వందనిమిషాలు... అంతే!'

'అట్లాగా? బోర్డుమీద 60 నిమిషాలుఅని వ్రాసి వుంది...!'

'అందుకనే బయటకు వచ్చా. పాయింట్ మాన్‌తో చెప్పిదిద్దించాలి. లేటు పెరిగిందని యిప్పుడేవార్త వచ్చింది'

'భగవాన్!' అన్నాడు శేఖర్ నిరాశగా!

'ఏమిటోనండి! ఒక్క రైలూ టైముకు రావడంలేదు. జనానికి జవాబులు చెప్పలేక చచ్చిపోతున్నాము. ఉద్యోగం కాదుగాని...' అనుకొంటూ శ్రీరాములు మనిషిని వెదుక్కుంటూ వెళ్ళిపోయినాడు.

శేఖర్‌కు గట్టిగా నిట్టూరుద్దామనిపించింది.

కాని ధైర్యం చాలిందికాదు.

రైలు అన్నప్రకారం వందనిమిషాలు అలస్యంగా వచ్చిన తరువాత కదా తాను 'అమ్మయ్య' అనుకోవలసింది!

శేఖర్ యింటికి వెళ్లిపోదాం అనుకున్నాడు.

రైలు రానడమంటూ యింకో గంట పైచిలుకుమాట.

ఈ లోపల యిక్కడ తారట్లాడడంకంటె యింటికి వెళ్లి భోజనంచేసి తాపీగా కునుకుతీసి తీరుబడిగా వస్తే యెలావుంటుంది? అయినా యింకా తన భోజనం సమయం కాలేదు. అదీగాక రెండు మైళ్లదూరం వెళ్ళి మళ్లీ యింతదూరం యీ చీకట్లో యీదులాడుకుంటూ రావాలంటే అదేమన్నా సాధ్యమయే పనేనా?

కష్టమో నిష్ఠూరమో యిక్కడ పడివుండడమే మంచిపని.

ఏదో యిట్లాగే అలోచించుకుంటూ కాలక్షేపంచేస్తే గంట అనేమాటేమిటి, రెండు మూడు గంటలయినా చులాగ్గా గడిచి పోతాయి.

అప్పుడు రైలు రానే వస్తుంది. అందుచేత అంతవరకు వేచి వుండడమే బుద్ధిమంతుని లక్షణం అనిపిస్తుంది.

అప్పటికి బాగా చీకటి పడిపోయింది.

ఆకాశంలో నక్షత్రాలు అక్కడక్కడా అగుపిస్తున్నాయి.

ఆవేళ తిథి యేమిటో శేఖర్‌కు తెలియదు.

బయట వెలుగుతున్న గుడ్డిలాంతరు తప్పితే వేరే వెలుగు అనేది లేదు.

ఈ చీకట్లో, ఈ స్టేషన్లో ఒంటరిగా తను యీ షికార్లు యేమిటి?

ఏమిటో ఒక్కొక్కమారు యిలా తటస్థపడుతుందని మనకు తెలీదు.

కనీసం యిట్లా జరుగుతుందని ఎవరైనా ముందుగా చెప్పినా నమ్మబుద్దికాదు.

నలుగురయిదుగురు మనుషులు తప్పించి నరసంచారంలేదు.

వాళ్లెవరూ తనకు తెలీదు.

బహూశా వాళ్లకు తను తెలిసి వుండవచ్చు.

వాళ్లది యీ వూరే అయితే తనను యెరిగేవుంటారు. ఎరిగితేనేం, ఎరక్కపోతేనేం రైలు మాత్రం సకాలానికి రాదు.

కనీసం అనుకున్న ఆలస్యానికయినారాదు.

నాలుగయిదు సిగరెట్లు ఒక్కబిగిని పీల్చేశాడు. నోరంతా వెగటుగా, చేదుగా వుంది. పెదవులు బిగిసిపోయాయి. ఏమిటో అలవాటు కానిపనులు చేస్తే యిలాగే వుంటుంది కాబోను.

శేఖర్ తనలో తను నవ్వుకున్నాడు.

సీత జ్ఞాపకానికి వచ్చింది. ఒక్క జ్ఞాపకానికే అని ఎందుకు? కాస్త నిదానంగా వుంటే రైలు బండిలో రానే వస్తుందిగా!

సీతను తలుచుకుని శేఖర్ నవ్వుకున్నాడు.

పిచ్చిపిల్ల.

ఈ పిచ్చిపిల్లకోసం తను స్టేషన్‌కు వచ్చాడు.

రైలు ఆలస్యం.

విసుగు.

చీకటి.

అన్నీ భరిస్తూ రైలుకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. రైల్లో వచ్చే సీతకోసం ప్లాట్‌ఫామ్‌మీద పచార్లు చేస్తున్నాడు.

సీతకోసం తను యిలా స్టేషన్‌కు రావలసి వస్తుందని తనకు తెలీదు.

ఇవాళ ఉదయం వరకూ తెలీదు. అయినా సీత యిలా ఎందుకు రావాలి?

అన్నీ అఘాయిత్యం పనులే చేస్తుంది. రైల్లో ఎందుకు ఒంటరిగా ప్రయాణం?

ఆలస్యంగావచ్చే ఈ రైళ్లలో సీత ఎందుకు ఒంటరిగా ప్రయాణం చేయాలి?

ఉదయం కాఫీ తాగుతూ వుంటే ఎవరో కవరు పట్టుకు వచ్చారు.

సంతకం పెట్టించుకు వెళ్లాడు.

విప్పిచూస్తే సీత నుంచి టెలిగ్రామ్. 'ఫలాన బండిలో ఫలానా వూరు వెళ్తున్నాను. నీ ఊళ్లో స్టేషన్‌లో కలుసుకో. మాట్లాడుకుందాం' యిదీ భాష! ఖర్మ! ఈ ఊళ్లో రైలుబండి రెండు నిమిషాలు ఆగుతుంది. ఈ రెండునిమిషాలలో సీత తనతో యేం మాట్లాడుతుంది? సీతతో తనేం మాట్లాడతాడు? కంపార్ట్ మెంటు వెదుక్కునేసరికి పుణ్యకాలం కాస్తా పూర్తి అవుతుంది. ఒక్కోసారి, అందుక్కూడా అవకాశం లేకపోవచ్చును. బోలెడన్ని పెట్టెలున్న రైలుబండిలో ఎక్కడని వెదకడం? ఎలా వెదకడం?

తన భయాలన్నీ తనకే!

సీత అఘాయిత్యం మనిషి. తంతి యిచ్చింది. వెళ్ళకుండా ఎట్లా? చూడ కుండా ఎట్లా? మాట్లాడకుండా ఎట్లా?

టెలిగ్రాం అందుకున్నప్పటి నుంచి తనకు సీతను గురించే ఆలోచనలు. వేరే యే ఉద్యోగము లేనట్లు ఒకటే ఆలోచన. అది మొదలు ఎట్లా అయిందో అర్థంకాదు. ఆఖరు అవదు. ఈ ఆలోచనకు ఒక స్వరూపం కూడా వున్నట్లు లేదు. ఒట్టి వెర్రి ఆలోచన. వెర్రి మొర్రి ఆలోచనలు తప్ప తనకు యింతకంటే వేరే వ్యాపృత్తి లేదు.

నిజానికి సీత తనకు యేమిటి?

గట్టిగా చెప్పాలంటే యేమిటీ కాదు. స్నేహితురాలు. అంతే. కాలేజిలో చదువుకునేటప్పుడు పరిచయస్తురాలు. అంతవరకే.

తను అంతవరకే అనుకుంటున్నాడు. అంతకంటే తనకేం తెలియదు. కనీసం తెలియదని అనుకుంటున్నాడు.

సీతకు యింకా చాల తెలుసునని తనకు అప్పుడప్పుడు అనిపిస్తుంది.

'వెన్నెట్లో కూర్చున్నప్పుడు యెప్పుడూ యిలాగే వుండిపోతే యెంత బాగుం టుంది' అంటుంది సీత. కాని తనకు మట్టుకు భయం.

భోజనం... నిద్ర... యివన్నీ ఎట్లా?

ఊరికే వెన్నెల్లో కూర్చుంటే తన భోజనం, తన నిద్ర యేమయిపోతాయి? ఎట్లా తనకు నిద్ర లేకపోతే? సీతకు యివన్నీ యేమీతట్టవు.

చెప్పినా అర్థం చేసుకోదు.

ఇవన్నీ తుచ్ఛమయినవిట!

ఏం మాట?

భోజనం తుచ్ఛమయినదంటే తను ఒక్కనాటికీ నమ్మడు.

అయినా ఆ పిల్లతో గొడవ పెట్టుకోవడం యిష్టంలేదు. పోనీలే. ఇష్టం వచ్చినట్లు అనుకోనీ!... అని ఊరుకున్నాడు.

ఇట్లా అనేక సందర్భాలు. తనకు యిదంతా గొప్ప విషయం కాదు.

ఊరికే రోజులు గడిచిపోతున్నాయి.

తనక్కావలసింది అంత వరకే.

కాలం గడిచిపోవడానికి యేదో ఒకటి చేయాలి.

ఎవరితోనయినా మాట్లాడుతూవుంటే కాలం యిట్టే గడిచి పోతుంది. మనకు తెలియకుండానే ముందుకు నడిచిపోతుంది. కాని ఎవరితో మాట్లాడడం? ఎవరున్నారు? ఎవరున్నారు తనతో యిష్టాగోష్టి చేయడానికి?

స్టేషన్ మాష్టర్ శ్రీరాములు... ఎంత సేపూ రైళ్లలోరద్దీని గురించి, తన ఉద్యోగం గురించి... తను కాబట్టి యిన్నాళ్లుగా దానిని నిలువుకుంటూ వస్తున్నాననీ ఊ చెప్పుకుపోతాడు. పెద్దవాడు యేదో చెబుతాడు... అనే ధోరణిలో వినవలసిందే తప్ప యింతకంటే తనకేం 'యింటరెస్ట్' వుండదు.

నిజానికి అసలు వినబుద్ధే కాదు.

అంతకన్నా కాలక్షేపం కోసం యెవరితోనన్నా పోట్లాటపెట్టుకోవడం మేలు.

అట్లా పోట్లాడుదామనుకున్నా యింకా ఎవరున్నారు?

ఉన్నవాళ్లు నలుగురూ తనతో పోట్లాడరు.

తను కావాలని గిల్లి కజ్జ పెట్టుకున్నా... 'పోనీలే, మతి చలించిందేమో, తెల్లవారేసరికి మామూలు మనిషి అవుతాడు' అనుకుని తమదారిని తాము వెడ తారు. అందుచేత ఇదేమీ ప్రయోజనం లేదు.

ఇలా అనుకోగానే మళ్లీ సీత జ్ఞాపకం వచ్చింది.

తను మరచిపోయినా మళ్లీ జ్ఞాపకం వస్తుంది సీత.

ఆలస్యంగా రైలు బండిలో వస్తున్న సీత!

ఇవాళ టెలిగ్రాం అందుకోగానే సీత తనకు వ్రాసిన మొదటి ఉత్తరం గుర్తుకువచ్చింది.

పెట్టెవెదికి, అడుగునుంచి ఉత్తరాలకట్ట పైకితీసి మళ్ళీ చదువుకున్నాడు.

అదే అక్షరాలు. నియమంగా అలాగే కనిపించాయి.

'మాష్టారూ! మీకు ప్రేమలో నమ్మకం లేకపోతే మానె. మనుష్యులలో నయినా నమ్మకం వుందిగా! మిమ్మల్ని నేను అర్థం చేసుకోలేనని మీరేం సందేహించవద్దు. నాకు అన్నీ తెలుసు. అన్నీ ఆలోచించుకున్నమీదటనే నేను ఇది నిశ్చయించుకున్నాను. నా నిశ్చయాన్ని మార్చాలని ప్రయత్నించకండి. అంతే!'

— ఏమిటో ఈ మాటలు తనకు అర్థంకావు.

ఈ భాషే తనకు కొత్త. అర్థంకాదు. అర్థం చేసుకుందామనుకున్నా లాభం లేదు. చదివి డ్రాయర్లో పడేశాడు ఉత్తరం.

అంతకంటే యింకేం చేయాలి, యిలాంటి ఉత్తరాన్ని?

శేఖర్ గట్టిగా ఊపిరి సలిపాడు.

సిగరెట్ వెలిగించాడు!

సీతను గురించి తనకేం అదుర్దా లేదు.

జీవితాన్ని గురించే అదుర్దా లేనివాడికి ఆ మనిషిని గురించి యేం ముఖ్యం?

చీకటి లేకపోతే యింత చికాకు అనిపించదు.

గుడ్డిదీపం వున్నా ఒకటే లేకపోయినా ఒకటే.

సీత తనకు పరిచయం. ఒకరకంగా తనను ఆ అమ్మాయి బాగా ఆకర్షించింది.

ఈ ఆకర్షణకు రకరకాల అర్థాలు చెప్పుకుంటే తనకేం తెలీదు!

తనను వివాహం చేసుకుందామని సీత అభిప్రాయం.

తన అభిప్రాయం కూడా అదేనని ఆ అమ్మాయి అనుకుంటే తనేం చేయగలదు?

ఒకళ్ల అభిప్రాయాలకోసం తనకు నచ్చనిపనులు చేయాలా?

ఈ పని తనకు నచ్చదా?

ఎందుచేత?

ఇవన్నీ తనకు అందని ప్రశ్నలు. ఇలాంటి ప్రశ్నలు తన మనసుకు ఎలా తెలుస్తున్నాయో అర్థంకాదు.

జవాబులు తెలియని ప్రశ్నలు అసలెందుకు బయలుదేరుతాయి?

వాటిని వెదికి పట్టుకోవాలంటే తనకంత తీరిక ఓపిక ఎక్కడుంది?

తను ఈ ఊరికి వస్తుంటే సీత ఏమన్నది?

'మాష్టారూ! ఊరు దాటిపోతున్నారు. మర్చిపోతారా?'

'మర్చిపోతే ఉత్తరాలు రాస్తూవుండు' అన్నాడు తను.

'ఉత్తరాలకు జవాబులు రాయడం మరచిపోతారా?'

'మర్చిపోతే గుర్తుచేస్తూ వుందు..'

'గుర్తు చేసినా మర్చిపోతారా?'

ఏమిటో మెలిక ప్రశ్నలు. ఒక్కటీ తనకు సాఫీగా సవ్యంగా తోచవు.

ఏమిటో గొడవ.

అఖరుకు అన్నాడు తనే.

'పెళ్లిచేసుకుంటే నువ్వే నన్ను మరచిపోతావు. అప్పుడు నేను మరచిపోయినా నన్ను విషయం కూడా మరచిపోతావు.'

సీత తన ముఖంలోనికి యేమిటో విచిత్రంగా చూచింది.

ఏమిటి ఆడవాళ్లు... వాళ్ల లేడికళ్లు... తనకసలే భయం. ఆమెవేపు చూడ లేక తలదించుకున్నాడు.

అంతకంటే తనకింకేం మాట్లాడటానికి తోచలేదు.

ప్లాట్ఫారమ్ గబగబ పరుగెత్తినట్లయింది.

గణగణమని గంట వినబడుతోంది.

శేఖర్ మనస్సు ఆలోచనలను విదిలించుకుని ఒకమారు కలయచూచింది.

రైలుబండి యింక వస్తుంది కాబోలు.

పక్క స్టేషన్లో బయలుదేరి వుంటుంది.

అక్కడనుంచి యిక్కడకు రావడానికి యిరవయి నిముషాలు పడుతుంది.

ఇరవై నిముషాలలో రైలు వస్తుంది.

ఇక్కడ ఆగే రెండు నిముషాలను కూడా కలుపుకుంటే... మొత్తంమీద ఒక్క అరగంట లోపుగానే తను యింటికి తిరుగు ప్రయాణం కట్టవచ్చును.

అమ్మయ్య—అనుకున్నాడు శేఖర్.

ఇంతవరకు కాలక్షేపం చేసింది ఒకఎత్తు. ఇప్పుడు జరగబోయే సమయం ఒకఎత్తు. నిజానికి సీతతో తను మాట్లాడే 'ఒక్క నిముషం' ఒక ఎత్తు, మిగతా టైమంతా ఒక ఎత్తు కావచ్చును.

కాని—చీకటిలో, కాస్తో కూస్తో చలిలో ఒంటరిగా తను యిక్కడ వుండడమే ఒక పెద్ద ఎత్తు!

శేఖర్ ప్లాట్ఫామ్ మళ్ళీ ఒక్కమారు చుట్టి వచ్చాడు.

దూరంగా స్తంభం దగ్గర ఎవరో భోజనం చేస్తున్నారు.

పులుసు వాసన ఘాటుగా కొడుతోంది.

ఇంతసేపూ నిద్రపోతున్న ఆకలంతా ఒక్కమారు పైకివచ్చింది.

ఒక్క అరగంట ఆగాలి.

ఆ తరువాత యింటికి వెళ్లి హాయిగా భోజనంచేసి వేపచెట్టు గాలి కింద నులక మంచం మీద మేను వాల్చుకుని... మళ్లీ అరుణోదయం అయ్యేవరకూ నిద్రపోవచ్చును.

శేఖర్‌కు మెలుకువ వచ్చి గడియారం చూసుకునేసరికి ఎనిమిది గంటలయింది.
అబ్బ. అప్పుడే ఎనిమిది అయింది.
పక్కమీద నుంచి లేవబుద్ధికాదు.
ఇట్లాగే ఎంతసేపయినా పడుకోగలిగితే బాగుండును. కాని కుదరదు.
తెల్లవారిన తరువాత బోలెడన్ని పనులు.

ఎంతకూ తెమలని పనులన్నీ చేయడానికి తను పొద్దున్నే ఆరు గంటలకే లేవవలసి ఉంది.

అప్పుడే ఎనిమిది గంటలయిపోయింది.
ప్రయత్నంమీద శేఖర్ లేచి కూర్చున్నాడు.
రెండు మూడు క్షణాలు కళ్లు మూసుకుని పక్కమీదనే కూర్చున్నాడు.
ఈ కొద్ది సేపట్లో అతని మనస్సును విశ్రాంతిగా వుంచడం, అతను కొన్ని సంవత్సరాల నుంచి అభ్యాసం చేసుకున్నాడు. ఆ తరువాత లేచి నిలుచున్నాడు.
తలుపు తీసుకుని దొడ్లోకి వెళ్లాడు.
పనిమనిషి సిమెంట్ తొట్టినిండా నీళ్లు పెట్టి రేకుమూత పడేసి వెళ్లిపోయింది.
హాయిగా ముఖం కడుక్కుని. స్నానం చేయవచ్చును.
ఈ రోజు చేయవలసిన పనిని మననం చేసుకున్నాడు.
ఈ రోజు యేమీ ప్రత్యేకించి పనిలేదు.
ఒకరోజు మటుకు గొప్పగా చెప్పుకోతగ్గ పనేం వుంది?
స్నానంచేసి ముందు గదిలోనికి వచ్చి కూర్చున్నాడు.
బట్టలు వేసుకున్నాడు.

ఎటన్నా వెడదామా అనిపించింది. మామూలు ధోరణిలో యిలా అనిపించినా నిజంగా వెళ్లదలుచుకుంటే మటుకు, యీ కుగ్రామంలో – మహానగరంలో – ఎలా వెళ్లేట్లు?

ఊరంతా చుట్టిరావటానికి అరగంట పట్టదు.
పనిమనిషి వచ్చింది.
'అయ్యగారూ!'

ఏం అన్నట్లు చూచాడు.
'కాఫీ తెమ్మంటారా?'
'ఊ.'
లోపలకు వెళ్ళింది.
ఫ్లాస్క్ తీసుకుంది.
డబ్బుకోసం నిలబడింది. శేఖర్ పర్స్‌తీసి యిచ్చాడు.
పనిమనిషి వెళ్లిపోయింది.
కాఫీ తాగాలని నియమం లేదు.
కాని పనిమనిషి వచ్చి అడిగింది గనుక తెప్పించుకోవడం!
రోజూ యిలారాదు.
ఇవాళ ఎందుకో తనమీద దయకలిగినట్లుంది. ఎందుకో?
పనిమనిషి కాఫీ తెచ్చి యిచ్చింది.
ఫ్లాస్క్‌లో కాఫీ గ్లాసులో పోసుకున్నాడు.
చప్పరిస్తున్నాడు.
పనిమనిషి వెళ్లిపోలేదు.
అడ్డదిడ్డంగా పడిన పుస్తకాలు, గుడ్డలు వాటి వాటి స్థలాల్లో సర్దుతోంది.
తన ధ్యాసలో తను కాఫీ తాగుతున్నాడు.
పానకం. శ్రీ రామనవమి గుర్తువచ్చింది.
పనిమనిషి గది ఊడవడం అయింది.
చీపురు తలుపుమాటున వోరగా వుంచింది.
'వెడుతున్నాను అయ్యగారూ' అంది.
'ఊ.'
'అయ్యగారు యివాళ ఆలస్యంగా లేచారు' అంది.
'ఊ..'
'దోమల బాధకు రాత్రి నిద్రపట్టలేదు కాబోలు.'
'ఊహు. రాత్రి స్టేషన్‌కు వెళ్లాను. ఆలస్యం అయింది.
అందుకు...'
'చుట్టాలు ఎవరయినా వచ్చారా?'
'ఊహు. రైల్లో ఊరికి వెడుతున్నారు. చూడడానికి వెళ్లాను.'
'అమ్మగారు వచ్చారేమో అనుకున్నాను... అమ్మగార్ని ఎప్పుడు తీసుకొస్తారు?'
'అమ్మగారెవరు?'... గతుక్కుమన్నాడు.
పనిమనిషి ముఖంలోకి చూచాడు, లోతుగా సూటిగా.

ఆ మనిషి ముఖం నవ్వుతో నిండివుంది.
పువ్వులా విచ్చుకుని వుంది.
ఆ ముఖం చూచాక శేఖర్‌కు ప్రశ్న అర్థం అయింది.
సిగ్గు అనిపించింది.
ఈ మనిషి యేమనుకుంటోంది?
తనకు పెళ్లి అయిందనుకుంటోంది?
తను యివాళో రేపో తన పెళ్లాన్ని యిక్కడికి కాపురానికి తీసుకువస్తాడను కుంటూంది. ఇంకానయం. తనకు పిల్లలుగూడా వున్నారనుకుంటూందేమో!
ఎట్లా చెప్పాలి, యీ పనిమనిషికి తనను గురించి?
ఏమని చెప్పాలి?
అయినా యీ మనిషికి లేనిపోని ఆరాలన్నీ యెందుక్కావాలి?
ఇంతకూ తను ఆలస్యంగా లేవడం యీ ప్రశ్నలన్నిటికీ కారణం.
'నాకింకా పెళ్లికాలేదు' అన్నాడు ముఖం కిందకు దించుకుని.
పనిమనిషి ముఖంలో ఆశ్చర్యం నిండింది.
శేఖర్ అటు చూడడంలేదు.
'నిజంగానా... అయ్యగారూ?' అన్నమాటలువినిపించాక శేఖర్ ఉలిక్కిపడ్డాడు.
తన మాటలు అబద్ధం అని యీ మనిషి ఎందుకు అనుకుంటూంది?
తన ముఖం అబద్ధాలు చెప్పేవాడిలాగా అనిపిస్తోందేమో?
తన ముఖం ఎలావుందో తనకు కనిపిస్తే బాగుండును.
పనిమనిషి ముఖంలోనికి చూచాడు.
అంత విచిత్రంగా లేదు.
మామూలుగానే వుంది.
అందులో పరిపరివిధాల ప్రశ్నలులేవు.
'ఇంకా చేసుకోలేదు...' అన్నాడు మళ్లీ తలదించుకుని.
'పోనీలెండి. ఈ సంవత్సరం చేసుకుంటారా?' అనడిగింది అమాయకంగా.
'ఊం... చూడాలి.'
'తప్పకుండా చేసుకోండి అయ్యగారూ. అమ్మ లేకపోతే యింటికి శోభలేదు. ఆమె వుంటే యిల్లంతా చక్కగా అమర్చి పెడతారు...'
శేఖర్ మామూలుగా విన్నాడు.
కాని పనిమనిషి యిన్ని మాటలు యెందుకు చెబుతోంది?
'ఇంకా పోదేం?' అనుకున్నాడు.

బల్లమీద వున్న 'పేపర్' తిరుగవేస్తున్నాడు.

నిన్నటిది.

ఈ ఊళ్లో సాయంత్రం నాలుగు గంటలగ్గాని పేపరురాదు.

తన ఊళ్లోకంటే యిరవయి నాలుగు గంటలు ఆలస్యంగా వార్తలు అందుతాయి యిక్కడికి.

ఈ విచిత్రమయిన వాతావరణంలో యిక్కడ యేమిటో తమాషాగా కొన్నాళ్లు గడపాలని వుందితనకు. తప్పదు.

పనిమనిషి 'నేను వెడుతున్నాను' అంది.

ఈసారి నిజంగానే కదిలి వెళ్లింది.

శేఖర్ యీ విషయం అంతగా పట్టించుకోలేదు.

పనిమనిషి వెళ్లిపోయిన తర్వాత ఆ మనిషి గురించి ఒకతెరగా ఆలోచన వచ్చింది.

పాపం, యిరవై.. యిరవై రెండు వుంటాయేమో!

ఏ కులస్థులోగాని చూడడానికి ముచ్చటగా ఎర్రగా బాగానే వుంటుంది.

కాని అనవసరంగా యెందుకో మాట్లాడుతోంది యివాళ.

తన పని తను చేసుకుపోతే చాలు.

పనిమనిషి కబుర్లు చెప్పనక్కర్లేదు.

తన యోగక్షేమాలు విచారించనవసరంలేదు.

శేఖర్ విసుక్కున్నాడు. ఎప్పుడయినా తను యీ సంగతులన్నీ విచారించాడా?

తనకేం అవసరం?

తను అనవసరంగా ఒక్కమాటయినా అడతాడా? లేదు.

పోనీలే... యేదో అడిగింది... చెప్పాను.

కొత్త మనిషి గనుక ఆరాతీసింది.

అంతే అని సమాధానం చెప్పుకున్నాడు శేఖర్... అంతే.

అంతటితో ఆ విషయం వదిలివేయాలనుకున్నాడు.

అనవసరం అయిన వాటికి ప్రాధాన్యం యిచ్చి బాధపడడం ఎందుకు?

మనస్సంతా వ్యధ చేసుకోవడం ఎందుకు? లేనిపోని పని.

తొమ్మిది గంట లయింది.

తనకింకా గంటన్నర టైం వుంది.

భోజనం చేయడం. బడికి వెళ్ళడం... యివే పన్లు.

సాయంత్రం దాకా కాలం ఎట్లా గడుస్తుందన్న ప్రశ్నలేదు.

ఐదు గంటల దాకా యిబ్బంది లేదు.

ప్రపంచంలో తనవంటి అదృష్టవంతులు యెందరో వుండరు.

ఏమిటో, రోజులు సజావుగా యే బాదరబందీలేకుండా దొర్లి పోతున్నాయి. అంతా సక్రమంగా జరిగిపోతోంది.

గడ్డుతనం లేకుండా నింపాదిగా సరసంగా దొర్లిపోతోంది కాలం.

నిజానికి యింతకంటే కావలసింది యేముంది?

ఎవరుమటుకు యింకేం కోరుకుంటారు?

అందరిసంగతీ తనకు తెలియదు. అందరి విషయమూ తను వకాల్తా పుచ్చు కోలేదు. తన విషయం మటుకు క్షుణ్ణంగా తెలుసు.

ఎంతవరకు తెలుసు?

ముందుమాత్రం ప్రత్యేకించి విశేషంగా చెప్పకోవలసిందియేముంది?

ఏమీ యిబ్బంది వుండదు – అనుకున్నాడు శేఖర్.

ఆలోచించుకుంటూ వుంటే కళ్లు బరువుగా తోస్తున్నాయి.

కళ్ళు నిజంగానే బరువుగా వున్నాయి.

ఎందుకని? నిద్ర లేక.

రాత్రంతా దాదాపు జాగారం చేయవలసి వచ్చింది.

అవును. సీత కోసం.

స్టేషన్‌కు వెళ్లడం వల్ల అలస్యం అయింది.

సీతను తలుచుకుంటే జాలివేస్తుంది.

వెర్రిపిల్ల – అనిపిస్తుంది.

ఏమీ తెలీనిది. ఎలా బ్రతుకుతుంది? అని కూడా అనిపిస్తుంది.

ఆ! అవును! ఇప్పుడు గుర్తుకు వచ్చింది.

రాత్రి రైల్లో తను సీతను చూచాడు.

టెలిగ్రాం యిచ్చినందుకు స్టేషన్‌కు వెడితే రైలు అలస్యంగా రావడం దాని కోసం తను ప్లాట్‌ఫామ్ మీద పచార్లు చేయడం. చివరకు రైలు రావడం – ఓ పెట్టెలో నుంచి సీత కేకవేయడం–ఇద్దరూ రెండు నిమిషాలు మాట్లాడు కోనడం – అంతా వరసగా గుర్తుకు వచ్చింది.

ఇదంతా జరిగి ఎన్నాళ్లయింది?

కనీసం ఒక శతాబ్దం అయినా అయివుంటుంది అనిపించింది శేఖర్‌కు. ఛ... కాదు రాత్రేగా. ఇంకా యిరవయినాలుగు గంటలయినా కాలేదు. అప్పుడే యివన్నీ చెరిగిపోయిన సంఘటనలలా అనిపిస్తున్నాయే?

రాత్రేగా సీత తనతో మాట్లాడింది.

ఆ మాటలు రెండూ చెవిని వేసుకుని యింటికి వచ్చి చేరుకున్నాడు. హాయిగా మంచం మీదకు చేరి కునుకుతీశాడు. తెల్లవారి యెనిమిది గంటలకు లేచాడు. ఇదీ జరిగింది!

ఇంతలో ఈ విషయాలన్నీ యెలా మరుపుకు వచ్చినాయి?

నిజంగా మరుపేనా? అసలు జరగలేదా? అంత మతిమరుపు వుంటుందా?

అబ్బే ఇదంతా భ్రమేమో! ఊరికే అనుకుంటున్నాను, అంతే. ఈ ఊళ్లో సీత ఎలా కనిపిస్తుంది? — అనుకున్నాడు శేఖర్

బల్లమీద టెలిగ్రాం.

రాత్రి రైలు. కళ్లబరువు. అవును.

రాత్రిరైల్లో సీత వెళ్లిన మాట నిజమే. రెండునిముషాలు మాట్లాడుకున్నారు.

సీత యేం చెప్పింది?

ఏమిటో గొడవగా చెప్పింది. వివరంగా అడగితెలుసుకుందుకయినా తన కంత విధామం ఎక్కడ వుంది గనుక? ఊరికే చిత్తరువులా వుండి విన్నాడు. అంతే.

సీత యిదివరకులాగే వుంది.

తనను చూడగానే నవ్వింది.

'ఏం మేష్టారూ కులాసాగా వున్నారా?' అంది ముందుగానే తను.

'ఆ! నువ్వు?' అన్నాడు చిరునవ్వు చిందిస్తూ.

'కనపడడంలా?' అంది సీత.

వెంటనే 'ఇంతకూ మాష్టారూ ఎలావుంది ఈ ఊరు?' అంది.

'బాగానే వుంది. నాకు ఎక్కడయినా ఒక్కటే' అన్నాడు.

సీత మళ్లీ 'నన్ను మరచి పోయారా' అంది.

'టెలిగ్రాం యిచ్చావుగా అందుకు వచ్చాను' అన్నాడు శేఖర్.

'రైలు అట్టేసేపు ఆగదు. అందుకని నిన్ననే ఉత్తరం వ్రాశాను. రేపు టపాలో మీకు అందుతుంది. సావకాశంగా చదువుకోండి. ఇంతకూ నేను వెళ్ళి పోతున్నాను మేష్టారూ. మళ్లీ మనం ఒకళ్ల నొకళ్లం చూచుకుంటామో లేదో. చివరిసారి నాకు సెలవు యివ్వండి' అంది.

తనకేం అర్థం కాలేదు.

అయినా 'అట్లాగేలే సీతా. ఎక్కడున్నా ఉత్తరాలు రాస్తూ వుండు. మళ్ళీ ఎక్కడోక్కడ కలుసుకోకుండా వుంటామా?' అంటూ జవాబు చెప్తున్నాడు తను.

ఇంతలో రైలు కూత వేసింది.

ఇంజను ముందుకు నడుస్తోంది.

రైలు పెట్టెలన్నీ ఒకదాని వెనుక ఒకటి బరబర ముందుకు వెడుతున్నాయి. తను ప్లాట్‌ఫామ్ మీద మిగిలిపోయాడు.

సీత కిటికీలోంచి తల ముందుకు పెట్టి కుడిచేయి ఊపుతోంది.

తనూ చేయి పైకెత్తాడు.

ఒక్క నిమిషం.

సీత మాయమయింది.

ప్లాట్‌ఫామ్ ఖాళీ అయింది.

తను యింటికి వెళ్ళిపోయాడు.

ఇప్పుడంతా గుర్తుకు వచ్చింది. ఏమిటో సీత తత్వం. మొదటినుంచి అంతే. ఒట్టి అడవి గొడవ. ఏమీ చెప్పదు. చెయ్యదు. ఒక వేళ యేదయినా చేసినా తనకు అర్థంకాదు.

ఇవాళ టపాలో ఉత్తరం వస్తుందట.

ఈ సంగతి చెప్పటానికేనా తనను రాత్రిపూట యింత యాతన పెట్టి పిలిపించింది!

ఉత్తరం వస్తుంది కద, ఫరవాలేదు.

వెంటనే జవాబువ్రాసి పడేయాలి.

వ్రాసిపడేస్తే మళ్లీ ఉత్తరం వచ్చే వరకు తనకేమీ బెంగవుండదు. తనకేమీ బాదరబందీ వుండదు.

శేఖర్ బయలుదేరాడు.

అద్దంలో ఒకమారు ముఖం చూచుకున్నాడు.

బాగానే వుంది. చొక్కా సవరించుకున్నాడు.

హోటలుకు వెళ్లి నాలుగు మెతుకులు నంజాడు.

ఏమిటో యీ హోటలు; యీలోకం.

ఎంతసేపూ ఆవకాయ, చింతకాయ పచ్చడి తన హోటలులో అనవరతమూ వంచిపెడుతూ వుంటానని మేనేజరు ఒకటేవాగుడు.

ఆ రెండూ వుంటే యింటిదగ్గర భోజనం చేసినట్లే వుంటుంది గనుక, అందరూ తన హోటలుకే వస్తారంటాడు. వాడిటొంద. వాడి కబుర్లు వింటూ వుంటే ఎక్కడలేని అసహ్యం పుట్టుకు వస్తుంది తనకు.

భోజనం అయిందనిపించుకుని కిల్లీ నములుకుంటూ బడికి వెళ్ళాడు. హెడ్

మాస్టర్ నశ్యం పీలుస్తూ తనవేపు వంకరగా చూచాడు.

'గుడ్‌మార్నింగ్' అంటూ పుస్తకంలో సంతకం పడేశాడు తను.

వెనక్కు వెళ్లిపోతూంటే జవాను 'సార్ – సార్' అంటూ దగ్గరకు వస్తున్నాడు.

శేఖర్ వాడిని చూచాడు.

'మీకో ఉత్తరం సార్' అంటూ కవరు అందించాడు.

శేఖర్ తాపీగా చిరునామా పరిశీలించాడు. తనదే.

తిన్నగా జేబులో వేసుకున్నాడు.

క్లాసుకి వెళ్లిపోయాడు.

పిల్లలకు పాఠం చెప్పడంలో మునిగిపోయాడు.

రెండు పీరిడ్లు గడిచిపోయి, మూడో గంట కొట్టారు.

ఇప్పుడు శేఖర్‌కు యేమీ క్లాస్ లేదు.

స్టాఫ్ గదిలోనికి వెళ్లాడు.

ఒక్కడే అక్కడ. ఏవో న్యూస్ పేపర్లు బల్లమీద పడి వున్నాయి.

వాటిని పక్కకు నెట్టి వేశాడు.

హాయిగా కుర్చీలో మేను వాల్చాడు.

జేబులోనుంచి ఉత్తరం తీశాడు.

కవరు చింపాడు. సీత రాసిన ఉత్తరమే. సందేహం లేదు.

అబ్బ, చాల పేజీలు వుంది ఉత్తరం.

ఇంత ఉత్తరం ఎంత ఓపికగా వ్రాసింది! – అనుకున్నాడు.

అయినా పిచ్చిగాని యింత ఉత్తరం యేమిటి – చేదస్తం మనిషి. నిన్ననేగా కనిపించింది. ఇంతలో ఉత్తరం ఎందుకు? – అనుకున్నాడు.

పదహారు పేజీలు.

చదవడానికయినా చాల ఓపిక కావాలి. సీత రాసిన ఉత్తరం.

చదవకపోతే యేమనుకుంటుందో, పోనీ, ఓపికగా చదువుదాం, అనుకున్నాడు.

మొదలెట్టాడు.

ఏమిటో గొడవ.

ఒక్కటీ అర్థం కాదు.

అసలు ఉత్తరాలు రాసే భాష అంటూ ఒకటి ఉందేమో, ఆ భాష తనకు రాదేమో అనుకున్నాడు.

ముఖ్యంగా సీతరాసే ఉత్తరాలు తనకెప్పుడూ అర్థంకావు.

ఏదో గందరగోళంగా వుంటాయి.

అయినా తప్పదుగా!

ఓపికగా చదువుకు పోతున్నాడు.

మనసుకు ఎక్కడం లేదు.

అక్కడక్కడ కాస్త సులభంగా వుంది.

పేజీలు తిరుగవేశాడు.

ఉత్తరం అయిపోయింది.

శేఖర్‌కు యేమీ అర్థం కాలేదు.

ఇన్ని పేజీల ఉత్తరంలోను తనకోసం, తనకు అర్థం అవడం కోసం ఒక్కటయినా మాట లేదా?

మళ్లీ మొదలుపెట్టాడు.

మధ్య మధ్య బాగా కనిపిస్తున్న ముక్కలు దగ్గరగా చదువుకోసాగాడు.

'మీరు మారతారేమోనని చాలాకాలం చూచాను. నా శ్రమంతా వృధా. నా ప్రయాసంతా వ్యర్థం అయింది. మీరు నాకు అర్థం కారు. నన్ను మీరు అర్థం చేసుకోలేరు.—

'నేనెన్నో ఆశలు పెట్టుకున్నాను. అవన్నీ మీరు తీరుస్తారని తలపోశాను. ఇదేమీ మీకర్థం కాదు. నన్ను సరిగ్గా చెప్పనివ్వరు. అప్పుడప్పుడు మీకు యివన్నీ చెప్పినా మీరు పట్టించుకోరు—

'ఎన్ని సంవత్సరాలు యిలా మీకోసం కనిపెట్టుకు వుండేది? మీనుంచీ ఒక్క మాట, ఒక్క పలుకు, ఒక్క ఓదార్పు వస్తుందేమోనని ఎంతకాలం యిలా చిన్నపిల్లలాగ కాచుకుని కూర్చోను? నాకేం కావాలో మీకు తెలియదు. మీకేం కావాలో మీకు తెలియదు—

'మొదట్లో నేను యిదంతా భ్రమేమో అనుకున్నాను. మీరు నిజంగా పరిపూర్ణులు, పైకి తేలరు - - అనుకున్నాను. సమయం వచ్చినప్పుడు మీరే ఆ ముక్క కాస్తా అంటారు — అని ఆశపెట్టుకున్నాను. ఆ సమయం ఎప్పుడు వస్తుంది? ఈ జన్మకు రాదేమో ననుకుంటున్నాను —

'మీరు నన్ను మరిచిపోలేదు. అందుకు మాత్రం థాంక్స్. కాని మిమ్మల్ని నేను మరిచిపోలేకుండా వున్నాను. అలా మరిచిపోగలిగితే బావుండును. భగవంతుడిని కోరుతున్నాను. ఎలా జరిగినా మీకు ఒకటే. కనుక మీరు కోరవలసింది యేమీలేదు.'

'నన్ను మీరు అన్యాయం చేసినందుకు నాకేం కోపం లేదు. ఇలా నిష్ఠూరాలు వ్రాస్తున్నానని మీరేం మరోరకంగా అనుకోకండి. నాకు యింతే ప్రాప్తం -- అని సరిపెట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నాను. అంతే!'

'ఇంతవరకూ నిరీక్షణలో గడిపిన యీ జీవిత కాలాన్ని మరో మలుపుతిప్పి కనీసం చేరువలో వున్న సుఖాలనయినా అనుభవయోగ్యం చేసుకుందామని నిశ్చయించుకున్నాను. క్షమించండి. మిమ్మల్ని మరిచిపోతున్నాను.

ఋణం వుంటే యింకెప్పుడయినా ఉత్తరం వ్రాస్తాను.'

....... ....... ....... ....... ....... ....... .......

ఇలా ముగిసిపోయింది ఉత్తరం.

మొదటి మాటు చదివినప్పుడు బాగుంది. అప్పుడసలేమీ అర్థం కాలేదు. ఇప్పుడు ఇదేదో కాస్త అక్కడక్కడా అర్థం అయినట్లూ కానట్లూ వుంది.

సీత తనను యేమంటోంది?

ఏమిటో కోప్పడుతోంది.

ఎందుకనో ఉత్తరం రాయనంటూంది. ఇంక మరిచిపోతానంటోంది.

మొదటి నుంచి తనకు తెలుసు సీత వొట్టి అఘాయిత్యం మనిషని!

ఏమిటో రాస్తుంది.

ఏమిటో చేస్తుంది.

తనకు యీ గొడవలన్నీ యెట్లా తెలుస్తాయి?

శేఖర్ ఉత్తరం మడిచి కవర్లో వుంచి చొక్కా జేబులో వేసుకున్నాడు.

ఇంతలో గంట మోగింది.

ఈ పీరియడ్ తనకేదో క్లాసు వున్నట్టుంది.

వెళ్ళాలి — అనుకున్నాడు.

స్టాఫ్ రూం దాటి బయటకు నడిచాడు.

అతని మనసు క్షణాలపాటు మళ్లీ నిర్లిప్తంగా తయారయింది.